# శివాజీ పరిపాలన ఆదర్శప్రాయం

- మాజీ మంత్రి జోగు రామన్న
- విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, డిసెంబర్ 13 : ఛత్రపతి శివాజీ పరిపాలన నేటికి ఆదర్శప్రాయమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని రణదీవేనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా జోగు రామన్నకు నాయకులు శివాజీ మహారాజ్ చిత్రపటం అందజేసి శాలువాతో సన్మానించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. మొదట కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌పై ప్రజలు నమ్మకం పెట్టి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. శివాజీ మహారాజ్ పాలనతో లేనటువంటి అసమానతలను నేడు కొన్ని పార్టీలు చూయించడం సబబు కాదని హెచ్చరించారు. ఎల్లవేళలా ప్రజానీకానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. పల్లెలు, పట్టణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. పాత పనులు కాకుండా కొత్త పనులు చేసి వారి పారదర్శకతను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, అధికార ప్రతినిధి గంగారెడ్డి, కౌన్సిలర్లు అశోక్‌స్వామి, వెనుగంటి ప్రకాశ్, భరత్ కుమార్, ఇమ్రాన్, నాయకులు పర్వీన్ ఫెరోజ్, మంచికట్ల ఆశమ్మ, నంద, రమ పాల్గొన్నారు.

# స్ట్రాంగ్‌రూం పరిశీలన



స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, డిసెంబర్ 13 : రానున్న పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఆదిలాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. రానున్న ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎన్నికల పర్యవేక్షకురాలు నలంద ప్రియా, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# టీబీ నివారణలో నిర్లక్ష్యం వద్దు

- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్




మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం, డిసెంబర్ 13 : టీబీ నివారణలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని జిల్లా టీబీ నివారణ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానితులను గుర్తిస్తూ వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. మందులు ఇచ్చిన అనంతరం మళ్లీ వారికి నిర్ధారణ పరీక్షలు చేయించి తదుపరి మందులు అందిస్తూ ఉండాలన్నారు. జిల్లా టీబీ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా టీబీ నివారణ కార్యక్రమ అధికారి ఎస్ సాయిప్రియా, ట్రీట్‌మెంట్ యూనిట్ డాక్టర్ ప్రసాద్, వైద్యులు సంజీవ్, వినోద్‌కుమార్, శ్రీకాంత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులురాలు కుమ్ర ఈశ్వరీబాయి

ఎదులాపురం, డిసెంబర్ 13 : సమాజంలో మహిళలపై దాడులు పెరగడం ఆందోళనకరమని ఇందుకోసం విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారోద్యమ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ దంపతుల చిత్రపటానికి దళిత స్త్రీశక్తి నేషనల్ కన్వీనర్ ఝాన్సీ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, డీఈవో ప్రణీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధనతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులు పెరగడం ఆందోళనకరమన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను అభినందించారు. అనంతరం కేజీబీవీ విద్యార్థినులు వివిధ అంశాలపై ఇచ్చిన నటక ప్రదర్శన, చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, సభ్యుడు సమీర్‌ఉల్లాఖాన్, డీసీపీవో రాజేంద్రప్రసాద్, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, జిల్లా కోఆర్డినేటర్ యశోద, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీలు, విద్యార్థులు, మెడికోలు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, ఆశకార్యకర్తలు, మెడికోలు

# పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలి

- ఆదిలాబాద్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్
- లింగట్ల, కిష్టాపూర్ గ్రామాల్లో పర్యటన



లింగట్లలో పరిసరాలు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

నేరడిగొండ, డిసెంబర్ 13 : గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని ఆదిలాబాద్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం లింగట్ల, కిష్టాపూర్ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మురుగు కాలువల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. మురుగు నీటితో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. అనంతరం ఆవాసాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే గ్రామాల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటి పన్నును సంబంధిత అధికారులు పూర్తి చేసే బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్‌లు స్వర్ణాంజలి, సోలంకి గీత, మండల పంచాయతీ అధికారిని శోభన, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, రజిత, సిబ్బంది ఉన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, డిసెంబర్ 13: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన గురుకులాల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న విద్య, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఏమైన నిర్మాణాలు అవసరమైన చోట చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, ఆర్‌సీవో గంగాధర్, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్